

భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 38.0
కనిష్ఠం : 27.0

వైసీపీ సర్కార్ హయాంలో భీమవరం పట్టణాభివృద్ధికి అలుముకున్న చీకట్లను కూటమి ప్రభుత్వం తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. జిల్లాల పునర్‌వ్యవస్థీకరణలో భాగంగా విభజిత పశ్చిమ గోదావరికి భీమవరం కేంద్రమైంది. దీనితో ఈ పట్టణం ఎంతో అభివృద్ధి చెందుతుందని అంతా భావించారు. కానీ, పరిస్థితి తారుమారైంది. అభివృద్ధి జరగకపోగా అన్ని రంగాలు దెబ్బతిన్నాయి. వ్యాపార రంగం కుదేలైంది. రియల్ ఎస్టేట్ పతనమైంది. ఆర్థిక రాజధానిగా పేరుపొందిన ఈ పట్టణంలో ప్రజల కొనుగోలు శక్తి పడిపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ పరిస్థితుల్లో మార్పు వస్తుందని టీడీపీ-జనసేన-బీజేపీ నాయకులు చెబుతున్నారు. అభివృద్ధిలో తనదైన మార్క్ చూపించిన పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) మూడోసారి ఎమ్మెల్యే కావడంతో భీమవరం దశ తిరిగినట్లేనని భావిస్తున్నారు.



భీమవరం దశ మారేలా



నిత్యం రద్దీతో భీమవరం పట్టణం

భీమవరం టౌన్, జూన్ 25 : వైసీపీ హయాంలో ఉండి నుంచి భీమవరం మీదుగా వెళ్ళే జాతీయ రహదారి నిర్మాణ పనులకు అవరోధాలు ఏర్పడ్డాయి. ఆ పార్టీ నేతలు అడ్డు తగలడంతో భూసేకరణ ప్రధాన సమస్యగా మారింది. ఫలితంగా జాతీయ రహదారికి ప్రతిపాదనలు రూపొందించలేకపోయారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం రాకతో జాతీయ రహదారిని పరుగులు పెట్టించాల్సిన అవసరం వుంది. ఇది జరిగితే భీమవరం రూపురేఖలు మారిపోనున్నాయి.

అప్రోచ్ రోడ్లకు ఏదీ మోక్షం ?

యనమదుర్రుపై నిర్మించిన వంతెనలకు అప్రోచ్‌ల ఏర్పాటుకు 2014లో టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే అంజిబాబు ప్రయత్నించారు. పనులు కొలిక్కి వచ్చే సమయంలో ప్రభుత్వం మారింది. జగన్ సర్కార్ రావడంతోనైనా ఇది ఒక కొలిక్కి వస్తుందని అంతా భావించారు. కాని, ఈ ఐదేళ్ల కూడా పనులు జరగలేదు. తిరిగి అంజిబాబు ఎమ్మెల్యే కావడంతో దీనికి మోక్షం లభిస్తుందని కూటమి నేతలు చెబుతున్నారు. అప్రోచ్ రహదారులు నిర్మిస్తే యనమదుర్రుకు అటు ఇటు వచ్చే గ్రామాల ప్రజల రాకపోకలకు మార్గం సుగమం అవుతుంది. భీమవరం నుంచి వంతెన మీదుగా వంద మీటర్లతోనే ఎదురుగా ఉన్న గ్రామానికి వెళ్ళిపోవచ్చు. ఇవి నిరుపయోగంగా మారడంతో 15 కిలోమీటర్లు పైనుంచి వంతెనకు అవలి వైపు ఉన్న గ్రామాలకు చేరుకోవలసి వస్తోంది. భీమవరం రూరల్ మండలంలో ఎన్నో ఏళ్ళుగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నికల ముందు జగన్ భీమవరం వచ్చినపుడు అప్రోచ్‌లను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అందుకోసం అవసరమైన రూ.30 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. ఎన్నికల ముందు టెండర్లు పిలుస్తున్నట్లు హడావుడి చేశారు. అంతేతప్ప అప్రోచ్ నిర్మాణం పూర్తి చేయలేదు. కూటమి ప్రభుత్వం దీనిని పూర్తి చేస్తే భీమవరం మండల ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న సమస్య పరిష్కారం లభిస్తుంది. ప్రజల సమస్య తీరుతుంది.



యనమదుర్రు కాల్వపై అప్రోచ్‌లు లేని వంతెన

ట్రాఫిక్ సమస్య

పట్టణానికి మరో ప్రధాన సమస్య ట్రాఫిక్. బయట నుంచి వచ్చే వాహనాలు పట్టణం మీదుగా వెళ్లడంతో నిత్యం ట్రాఫిక్ సమస్య వెంటాడుతోంది. ప్రధాన రోడ్డుపై ఏదైనా ఇబ్బంది వచ్చిందా ? ఇకంతే ! చాంతాడంత ట్రాఫిక్ నిలిచిపోతుంది.

కూటమి ప్రభుత్వంపైనే పట్టణ ప్రజల ఆశలు

- జాతీయ రహదారి పనులు పూర్తికావాలి
- యనమదుర్రుపై వంతెనలకు అప్రోచ్‌లు నిర్మించాలి
- కాలువ కాలుష్య నివారణకు కోట్లు కేటాయించాలి
- ఎన్నో ఏళ్లుగా ఉన్న కంపోస్టు యార్డు సమస్యను తీర్చాలి
- ట్రాఫిక్ సమస్య నివారణకు రింగ్ రోడ్లు వేయాలి
- కుదేలైన నిర్మాణ రంగానికి ఊపిరి పోయాలి



నిత్యం బయట నుంచి పట్టణానికి వేలాది మంది వాహనాలతో వచ్చి కొనుగోలు చేస్తుంటారు. సరైన పార్కింగ్ లేకపోవడంతో ప్రధాన మార్కెట్ మీదుగా ట్రాఫిక్ వెళ్లడంతో ఈ సమస్యకు పరిష్కారం లభించటం లేదు. సమస్య పరిష్కారానికి రింగ్ రోడ్లను ప్రతిపాదించినా ఇప్పటి వరకు ఒకటి కూడా కార్యాచరణకు నోచుకోలేదు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రతిపాదనలు పంపినా కేంద్ర స్థాయిలో వాటికి ఆమోదం లభించలేదు. కూటమి ప్రభుత్వం దీనిని పరిష్కరించాల్సి వుంది.

కుదేలైన నిర్మాణ రంగం

అపార్ట్‌మెంట్ నిర్మాణం రంగం పూర్తిగా నిలిచిపోయింది. గతంలో భారీస్థాయిలో నిర్మాణాలు జరిగేవి. ఐదేళ్లుగా నిర్మాణ రంగం నిలిచిపోయింది. ఈ రంగంలో ఉన్నవారు చేపట్టిన ప్రాజెక్టులను పూర్తి చేసి చేతులు దులుపుకున్నారు. మూడేళ్ల నుంచి నిర్మాణాలు లేవు. ఈ రంగానికి అవసరమైన ఇసుక, కంకర, ఐరన్, సిమెంట్ ధరలు విపరీతంగా పెరగడం కూడా ఆగిపోవటానికి ఒక కారణం. దీంతో దినసరి కూలీలకు పనులు దొరకని పరిస్థితి. ఇప్పుడు ప్రభుత్వం మారడం, నిబంధనలకు సడలింపు ఇవ్వడంతో సామగ్రి అందుబాటులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఈ రంగంకు ఊపు వచ్చే పరిస్థితులు కనిపిస్తున్నాయి.



- **యనమదుర్రు కాలుష్యం**

యనమదుర్రు కాలుష్య నివారణ కోసం గతంలో తెలుగు దేశం ప్రభుత్వం రూ.100 కోట్లు కేటాయించింది. వైసీపీ సర్కార్ వచ్చిన తర్వాత పూర్తిగా విస్మరించింది. కాలుష్యాన్ని పట్టించుకోలేదు. గతంలో యనమదుర్రు కాల్వలో నీరు తాగునీటి అవసరాలుగా వినియోగించేవారు. అటువంటి కాల్వ నేడు దుర్గంధం వెదజల్లుతోంది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం దీనిపై దృష్టి సారించాల్సి వుంది.

- **అమృత జలాలు చేరేనా**

పదేళ్ళ క్రితం పట్టణ శివారు ప్రాంతాల ప్రజలకు మంచి నీరందించేందుకు టీడీపీ హయాంలో ఏర్పాటు చేసిన అమృత్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఇప్పుడిప్పుడే ప్రజల వద్ద నీరు ఈ పైపులైన్ ద్వారా అందించే చర్యలు జరుగుతున్నాయి. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం అమృత్ పథకాన్ని పట్టించుకోకపోవంటో పనులు ముందుకు సాగలేదు. ఎన్నికలు వస్తుండడంతో హడావుడిగా అమృత్ పనులను పూర్తి చేసే ప్రక్రియ చేపట్టారు. మూడు రిజర్వాయర్ల నిర్మాణంతో సగంలో ఆగిన వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ పనులను పూర్తిచేసి ప్రారంభోత్సవం చేసి గొప్పగా ప్రకటనలు చేసుకున్నారు. ఇంకా కనెక్షన్‌లు పూర్తికాలేదు. ఎవరి హయాంలో మొదలైందో ఆయన ఎమ్మెల్యేగా తిరిగి ఎన్నిక కావటంతో పనులు వేగవంతంగా సాగి అమృత్ నీరు అందుతుందనే ప్రజలు భావిస్తున్నారు. అమృత్ ఫేజ్-2లోను పట్టణానికి నిధులు వచ్చిన నేపథ్యంలో ఆ పనులు సకాలంలో పూర్తి చేస్తే ప్రజలకు మంచినీటి సమస్య తీరినట్లే.

- **కంపోస్టు యార్డు సమస్య**

పట్టణాన్ని పట్టి పీడిస్తున్న కంపోస్టు యార్డు సమస్య పరిష్కారం లభిస్తుందనే ఆశ పట్టణ ప్రజల్లో కనిపిస్తోంది. దాదాపు 20 ఏళ్ళుగా కంపోస్టుకు స్థలం లేక చివరకు కాల్వగట్టులను వినియోగించడంతో అక్కడ కొండలా పేరుకుపోయిన కాల్వ కుచించుకుపోయే పరిస్థితి. ఎక్కడ ప్రయత్నాలు చేసినా అడ్డుకోవడంతోపాటు కోర్టుల్లో పెండింగ్‌లో ఉండటంతో సమస్య మరింత జటిలంగా మారింది. వైసీపీ హయాంలో కంపోస్టు యార్డు సమస్య పరిష్కారమైంది, స్థల సేకరణ జరిగిందనే ప్రచారం చేశారు తప్ప ఆచరణలో కనిపించలేదు. దీనిపై కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టాలి.



గుట్టలుగా పెరిగిన చెత్త కుప్పలు

మంత్రి నిమ్మలతో కలెక్టర్ నాగరాణి



భీమవరం టౌన్, జూన్ 25:పశ్చిమ గోదావరి జిల్లా నూతన కలెక్టర్ చదలవాడ నాగరాణి మంగళవారం రాష్ట్ర సచివాలయంలో జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడును మర్యాద పూర్వకంగా కలిశారు. సాంకేతిక విద్యాశాఖ కమిషనర్‌గా ఉన్న ఆమె జిల్లా కలెక్టర్‌గా ఒకటి, రెండు రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు.

తణుకులో ఆసుపత్రుల తనిఖీ

తణుకు, జూన్ 25 : తణుకు పట్టణంలో నిర్వహిస్తున్న పలు ఆసుపత్రులను జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు మంగళవారం తనిఖీలు చేశారు. ఆరోగ్య ఆసుపత్రి నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదులపై తనిఖీలు చేసినట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి బి.మహేశ్వరరావు తెలిపారు. నిర్వాహకులు నిపుణులైన వైద్యులను రప్పిస్తున్నట్లు చెప్పి, రోగులకు సాధారణ సిబ్బందితో వైద్యం చేయిస్తున్నారని చెప్పారు. ఆసుపత్రిని మరో ప్రాంతానికి మారుస్తున్నట్లు తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా బయటబోర్డు పెట్టడంపైన నోటీసులు చేసి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆసుపత్రిలో రికార్డులను పరిశీలించారు. జానకి ఆసుపత్రిలోను తనిఖీలు నిర్వహించారు. డెమో అనంతలక్ష్మి, తణుకు పట్టణ మెడికల్ ఆఫీసర్ రవికుమార్, డా.ఎన్.డానియేల్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీవారి కొండపై ఆక్రమణల తొలగింపు

ద్వారకా తిరుమల, జూన్ 25 : శ్రీవారి శేషాచలంపై వున్న ఫ్యాన్సీ దుకాణదారులు తమకు ఇచ్చిన పరిధిని మించి ముందుకు వచ్చి రోడ్డును ఆక్రమించడంతో యాత్రికుల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. దీనిపై వచ్చిన ఫిర్యాదుల మేరకు ఆలయ అధికారులు, సిబ్బంది మంగళవారం వాటిని తొలగించారు. ఇకపై ముందుకు రావద్దని దుకాణదారులను హెచ్చరించారు.

ఫోర్ లైన్స్‌కు లైన్ క్లియర్



దిగమర్రు బైపాస్ సెంటర్

దిగమర్రు టు పామర్రు 165 నంబరు జాతీయ రహదారి

- రెండు ప్యాకేజీలుగా పనుల విభజన
- పామర్రు టు ఆకివీడు మూడేళ్లుగా జరుగుతున్న పనులు
- తాజాగా ఆకివీడు టు దిగమర్రు పనులకు తొలగిన అడ్డంకులు
- రూ.1,500 కోట్లతో డీపీఆర్.. ఈ ఏడాది యాక్షన్ ప్లాన్

నరసాపురం, జూన్ 25 : పాలకొల్లు మండలం దిగమర్రు నుంచి కృష్ణా జిల్లా పామర్రు వరకు నాలుగు లైన్ల జాతీయ రహదారి నిర్మాణానికి కేంద్రం పచ్చ జెండా ఊపి నాలుగేళ్లు గడిచింది. 114 కిలోమీటర్ల మేర చేపట్టే ఈ జాతీయ రహదారి పనులను రెండు విభాగాలుగా విభజించారు. ఇందులో పామర్రు నుంచి ఆకివీడు వరకు 64 కిలోమీటర్లు మొదటి ప్యాకేజీలో ఉన్నాయి. మూడేళ్ళ క్రితమే పనులు ప్రారంభమయ్యాయి. రెండో ప్యాకేజీలో దిగుమర్రు నుంచి ఆకివీడు వరకు చేపట్టే 40 కిలోమీటర్ల రహదారి పనులు ఉన్నాయి. దీని నిర్మాణానికి ఇప్పటి వరకు అడుగడుగునా అడ్డంకులు ఏర్పడుతూ వచ్చాయి. భూసేకరణలో చాలా మంది రైతులు కోర్టులను ఆశ్రయించారు. ఇవన్నీ ఈ ఏడాది ఆరంభంలో క్లియర్ అయ్యాయి. దీంతో పెండింగ్ పనులను వేగవంతం చేసేందుకు జాతీయ రహదారి అధికారులు డీపీఆర్‌ను సిద్ధం చేస్తున్నారు. దీని నిర్మాణానికి రూ.1,500 కోట్లు ఖర్చు అవుతుందని అంచనాకు వచ్చారు. ఇందులో భూసేకరణ, మూడు, నాలుగుచోట్ల వంతెన నిర్మాణాలకు భారీ వ్యయం అవుతుందని ప్రాథమికంగా అంచనా వేశారు. ఇప్పటికే ఈ రహదారి పనులకు నిధులు కేటాయింపు కోసం ఈ ఏడాది యాక్షన్ ప్లాన్‌లో చేర్చారు. త్వరలో కేంద్రం ప్రవేశపెట్టే బడ్జెట్‌లో ఈ పనులకు నిధులు మంజూరుకానున్నాయి. ఈ రహదారిని 165 నెంబర్ పేరుతో అభివృద్ధి చేయనున్నారు. ఈ రహదారి పాలకొల్లు మండలం బల్లిపాడు, వీరవాసరం, భీమవరం మీదుగా ఆకివీడు వెళుతుంది.

కత్తిపూడి నుంచి పామర్రు వరకు

కత్తిపూడి నుంచి దిగమర్రు వరకు 216 జాతీయ రహదారి ఉంది. దిగమర్రు నుంచి నరసాపురం, మొగల్తూరు మీదుగా ఈ రహదారి మచిలీపట్నం, బాపట్ల, ఒంగోలు వెళుతుంది. ఇప్పటికే ఈ రహదారి పూర్తి కావడంతో ట్రాఫిక్ పెరిగింది. విశాఖ, తూర్పు గోదావరి జిల్లాలకు చెందిన చాలా మంది వాహనదారులు ఒంగోలు, మచిలీపట్నం, విజయవాడలకు ఈ రహదారిని వినియోగిస్తున్నారు. తాజాగా దిగమర్రు నుంచి విజయవాడకు సమీపాన వున్న పామర్రు వరకు 165వ నెంబర్‌తో నాలుగు లైన్ల రహదారిని నిర్మిస్తే వీరవాసరం, భీమవరం, ఆకివీడు వంటి పట్టణాలు మరింత అభివృద్ధికి నోచుకోనున్నాయి. ఇటు విజయవాడ మీదుగా వెళ్లే ప్రయాణికులకు ప్రత్యామ్నాయంగా మరో జాతీయ రహదారి అందుబాటులోకి రానుంది.

ప్రవాహానికి చెట్టు బ్రేక్



పాలకోడేరు, జూన్ 25: కొండేపూడిలో జేఅండ్‌వీ పంట కాల్వ ప్రవాహానికి అడ్డుగా ఇటీవల వీచిన ఈదురు గాలులకు నిద్రగన్నేరు చెట్టు పడిపోవడంతో చెత్తా చెదారం పేరుకుపోయింది. ఈ పంట కాల్వ అత్తిలి మీదుగా పాలకోడేరు, భీమవరం మండలాలకు వెళుతుంది. ఇది ఆయా గ్రామాల ప్రజలకు తాగు నీటితోపాటు సాగు నీటిని అందిస్తుంది. పడిపోయిన చెట్టును ఇరిగేషన్ అధికారులు తొలగించే ప్రయత్నం చేయకపోవడంతో కాల్వలో కొట్టుకొస్తున్న చెత్తా చెదారంతోపాటు మృత కళేబరాలు ఇక్కడ నిలిచిపోతున్నాయి. ఇది స్థానికులకు తీవ్ర ఇబ్బందిగా మారింది. దీనిని తొలగించాలని మండల బీసీ నాయకులు కొండేపూడికి చెందిన బొక్కా రాంబాబు అన్నారు.

వారంలోగా తొలగించకుంటే మేమే కూల్చేస్తాం

- నిబంధనలకు విరుద్ధంగా జిల్లా వైసీపీ కార్యాలయ నిర్మాణం : నోటీసులు జారీ చేసిన అధికారులు



భవనాన్ని పరిశీలించి నోటీసు అంటిస్తున్న సిబ్బంది

ఉండి, జూన్ 25 : నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న పశ్చిమ గోదావరి జిల్లా వైసీపీ కార్యాలయాన్ని వారం రోజుల్లో తొలగించాలని, లేకుంటే తామే కూల్చేస్తామని అధికారులు నోటీసులు ఇచ్చారు. ఉండి మండలం ఎన్ఆర్‌పీ అగ్రహారంలో 72 సెంట్ల స్థలంలో వైసీపీ జిల్లా కార్యాలయాన్ని రాంకీ ఇన్ ఫ్రా సంస్థ నిర్మిస్తోంది. పంచాయతీ అనుమతులు లేకుండా 1,122 చదరపు మీటర్ల విస్తీర్ణంలో దీనిని నిర్మిస్తున్నట్లు గుర్తించారు. వారం రోజుల్లో సమాధానం చెప్పాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు రంగనాధరాజు పేరుతో నోటీసులు జారీచేశారు. భవన నిర్మాణాన్ని నిబంధనలకు అనుగుణంగా మార్పులు చేయాలని గ్రామ కార్యదర్శి జేవీ తాతానాయుడు సూచించారు. నిర్మాణాలను పంచాయతీ సిబ్బంది, మహిళా పోలీసులు మంగళవారం పరిశీలించి నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్నట్టు గుర్తించారు. టీడీపీ మండల నాయకులు ఈ కార్యాలయాన్ని సందర్శించారు. అత్యంత విలువైన స్థలాన్ని వైసీపీ కారు చౌకగా లీజుకు తీసుకోవడాన్ని తప్పుబట్టారు. రాష్ట్రంలోని అన్ని వైసీపీ కార్యాలయాలు అక్రమ నిర్మాణాలని ప్రభుత్వం గుర్తించి తక్షణమే రంగంలోకి దిగింది. క్షేత్రస్థాయిలో సిబ్బంది చర్యలకు ఉపక్రమిస్తున్నారు. ఇందులో భాగంగానే రంగనాధరాజుకు నోటీసు పంపారు. వారం రోజులు గడువు ఇచ్చారు.



ప్రభుత్వం మారినా ఆగని ఇసుక దోపిడీ
7



12 రైళ్ల రాకపోకల పునరుద్ధరణ
7



కనిపించని పట్టిసీమ పరవళ్లు
7



తాటాకు ధరలకు రెక్కలు.. వంద రూ.1500
7

12 రైళ్ల రాకపోకలు పునరుద్ధరణ

ఏలూరు క్రైం, జూన్ 25: విజయవాడ సౌత్ సెంట్రల్ రైల్వే డివిజన్ పరిధిలోని చాగల్లు, రాజమండ్రి సెక్షన్స్ పరిధిలో ట్రాఫిక్ నిర్వహణ పనుల కారణంగా పలు రైళ్ల రాకపోకలు అక్టోబరు వరకు రద్దు చేశారు. వాటిలో కొన్నిటిని సెప్టెంబరు 16 వరకు మాత్రమే రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు మంగళవారం తెలిపారు. ఈనెల 21 నుంచి పలు రైళ్లను అక్టోబరు వరకు రద్దు చేస్తున్నట్లు ఈనెల 7న ఉత్తర్వులు జారీ చేశారు. ప్రయాణికుల సౌకర్యార్థం వాటిలో 12 రైళ్లను సెప్టెంబరు 16 నుంచి పునరుద్ధరిస్తున్నట్లు విజయవాడ డివిజన్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ నుస్రత్ ఎం మండ్రూప్‌కర్ తెలిపారు. ప్రత్యేక సర్వీసులుగా కొనసాగిస్తున్న మరో రెండు రైళ్లను పొడిగించారు. 07466, 07467 రాజమండ్రి-విశాఖ-రాజమండ్రి, 17257, 17258 విజయవాడ- కాకినాడ-విజయవాడ, 17219, 17220 మచిలీపట్నం-విశాఖ-మచిలీపట్నం, 17239, 17240 గుంటూరు-విశాఖ-గుంటూరు, 22702, 22701 గుంటూరు-విశాఖ-గుంటూరు, 22708, 22707 తిరుపతి-విశాఖ-తిరుపతి రైళ్ల యథావిధిగా రాకపోకలు సాగిస్తాయన్నారు. నిడదవోలు- సామర్లకోట సెక్షన్ల నడుమ ఈ నెల 24 నుంచి ఆగస్టు 10 వరకూ రద్దు చేసిన 26 రైళ్లలో జన్మ భూమి, సర్కారు మాత్రమే పునరుద్ధరించారు. మిగతా రైళ్లు తాత్కాలిక రద్దు జాబితాలోనే ఉన్నాయి. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా 07153 నర్సాపురం - ఎస్ఎంవీటీ బెంగళూరు (శుక్రవారం) ఈనెల 28 నుంచి ఆగస్టు 9 వరకు, 07154 ఎస్ఎంవిటి బెంగళూరు-నరసాపురం (శనివారం) జులై 6 నుంచి ఆగస్టు 10 వరకు పొడిగించారు.

టీడీపీ మహిళా నేత చలసాని విజయలక్ష్మి మృతి


విజయలక్ష్మి(ఫైల్)

దెందులూరు, జూన్ 25: వ్యవసాయ మార్కెట్ కమిటీ, గ్రంథాలయం, వ్యాయమ కళాశాల, ప్రభుత్వ పాఠశాలలకు స్థలాలను దానం చేసిన గోపన్నపాలెం టీడీపీ మహిళ నేత, పారిశ్రామికవేత్త చలసాని విజయలక్ష్మి(76) అనారోగ్యంతో మృతి చెందారు. దెందులూరు మండలం గోపన్నపాలెం గ్రామంలోని ఆమె నివాసంలో మంగళవారం మృతి చెందారు. విజయలక్ష్మి మృతదేహాన్ని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, టీడీపీ మండల అధ్యక్షుడు మాగంటి మిల్లుబాబు, మాజీ సర్పంచ్ కొండేటి హనుమంతు, పలువురు ప్రముఖులు సందర్శించి నివాళులర్పించారు. విజయలక్ష్మి కుమారుడు లక్ష్మీ సంజీవిని గార్మెంట్ సంస్థల అధినేత చలసాని శ్రీధర్‌బాబు, మరో కుమారుడు ఎన్ఆర్ఐ చలసాని శ్రీనివాసరావును పలువురు పరామర్శించి సానుభూతి తెలిపారు. అంతిమయాత్రలో కుటుంబ సభ్యులు బంధువులు, గ్రామస్తులు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

చదువులో రాణిస్తే మంచి భవిష్యత్


విద్యార్థినులతో మాట్లాడుతున్న ఆర్‌జేడీ

భీమవరం ఎడ్యుకేషన్, జూన్ 25 : చదువులో రాణించినప్పుడే మంచి భవిష్యత్ ఉంటుందని విద్యార్థినులకు ఆర్‌జేడీ నాగమణి సూచించారు. భీమవరంలోని పీఎస్ఎం బాలికల ఉన్నత పాఠశాలను మంగళవారం పరిశీలించారు. పదో తరగతి విద్యార్థినులకు నాగమణి చదువుపై అవగాహన కల్పించారు. మంచి ఉత్తీర్ణత ప్రతీ ఒక్కరూ సాధించాలని తెలిపారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకంను పరిశీలించారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు జె సుధారాణి, ఉపాధ్యాయులు రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు

అండర్-8 టెన్నిస్‌లో ధార్షిక్ ప్రతిభ

పాలకొల్లు రూరల్, జూన్ 25: ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన అండర్ 8, 10 టెన్నిస్ టోర్నమెంట్‌లో రెండు విభాగాల్లో పట్టణానికి చెందిన ఈ.ధార్షిక్ ద్వితీయ స్థానం సాధించాడు. పట్టణానికి చెందిన వైద్యులు అజిత్ కుమార్, భావన కుమారుడు ధార్షిక్. టెన్నిస్‌లో కోచ్ కిరణ్‌శంకర్‌తో శిక్షణ ఇప్పిస్తున్నారు. బహుమతులు కైవసం చేసుకున్న ధార్షిక్‌ను టౌన్‌హాల్ అధ్యక్షుడు రాధాకృష్ణ, కార్యదర్శి ముచ్చర్ల ఆదినారాయణ, కోశాధికారి యాదంరెడ్డి శ్రీనివాసు, రావూరి చాచా, మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్, జక్కంపూడి రంగారావు, గుణ్ణం ప్రభుదాసు, ఆకుల అరవిందుడు, ఆరిమిల్లి వీరాస్వామి తదితరులు అభినందించారు.

స్విమ్మింగ్ జాతీయ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

ఏలూరు టూటౌన్, జూన్ 25: జూనియర్ వాటర్ పోలో జాతీయ స్థాయి పోటీలకు ఏలూరు జిల్లా నుంచి పి.రఘురామ్, షేక్ హుఖీల్, ఎ.యశ్వంత్ ఎన్నికయ్యారు. క్రీడాకారులను జిల్లా క్రీడాభివృద్ధి అధికారి శ్రీనివాసరావు, కోచ్ గణేశ్, అసోసియేషన్ కార్యదర్శి మల్లికార్జునరావు అభినందించారు. ఎంపికైన క్రీడాకారులు జూలై 7న మధ్యప్రదేశ్ ఇండోర్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

నేడు ఉద్యాన వర్సిటీ ఆవిర్భావ దినోత్సవం

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 25: వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం బుధవారం 17వ ఆవిర్భావ దినోత్సవం జరుపుకోనున్నట్టు వీసీ జానకిరామ్ మంగళవారం తెలిపారు. 2007లో ప్రారంభమైన ఉద్యాన విశ్వవిద్యాలయం రైతులకు ఎన్నో కొత్త వంగడాలు అందించడంతోపాటు, ఉద్యాన విద్యనందించి ఎంతో మంది విద్యార్థులను సమాజానికి అందించిందని వివరించారు.

డీసీసీబీ చైర్మన్ పదవి కలవకొలను తాతాజీకి ఇవ్వాలి

కొయ్యలగూడెం, జూన్ 25: జిల్లా సహకార బ్యాంక్ పదవికి అనుభవం కలిగిన కలవకొలను తాతాజీకి ఇస్తే అభివృద్ధి జరుగుతుందని డీసీసీబీ మాజీ చైర్మన్ కరాటం రాంబాబు సూచించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ జిల్లా సహకార బ్యాంకు ద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. సమర్థవంతమైన వ్యక్తికి పదవి ఇస్తే న్యాయం జరుగుతుందన్నారు. తాతాజీ గత 20 ఏళ్లుగా సహకార రంగంలో సేవలందించిన అనుభవం ఉందన్నారు. చైర్మన్ పదవిని తాతాజీకి కేటాయించి సహకార రంగాన్ని అభివృద్ధి చేయాలని అభిప్రాయం వ్యక్తం చేశారు.

వీఆర్‌కు హెడ్ కానిస్టేబుల్

భీమవరం క్రైం, జూన్ 25 : నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన హెడ్ కానిస్టేబుల్‌పై వేటు పడింది. భీమవరం టూటౌన్ సీఐ జి.శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న పురుషోత్తం సోషల్ మీడియా ద్వారా పలు కమ్యూనిటీలు గురించి మాట్లాడుతూ వైరల్ చేశారు. ఆ విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో విచారణ అనంతరం హెడ్ కానిస్టేబుల్‌ను వీఆర్‌కు పంపించినట్లు సీఐ తెలిపారు.


వ్యాన్‌పై తరలిస్తున్న తాటాకులు

పేదల గూడు పెనుభారం

తాటాకు ధరలకు రెక్కలు.. వంద తాటాకులు రూ.1500

గణపవరం, జూన్ 25: పేదవాడి తాటాకుల గూడు కూడా పెనుభారంగా మారింది. తాటాకిళ్లు వర్షాకాలానికి ముందుగానే పైకప్పు ఆకులతో కుట్టించుకోవాలి. తాటాకు ధరలు చుక్కలనంటడంతో పేదలు అల్లాడిపోతున్నారు. వంద తాటాకులు రూ.1500 నుంచి రూ.2వేలు ధర పలకడంతో ఇల్లు పైకప్పు కుట్టించే పరిస్థితి లేకుండాపోయింది. గ్రామాల్లో అక్కడక్కడ మాత్రమే తాటాకిళ్లలో నివాసం ఉండే పేదలకు గూడుపై చింత పట్టుకుంది. భవిష్యత్తులో అవి కూడా కనుమరుగయ్యే పరిస్థితి ఉంది. కడునిరుపేదలు రెండుగదుల క్రింద తాటాకిల్లు నేయించుకోవలాంటే రూ.600 - 800 వరకు తాటాకులు అవసరం. ఒక ఇల్లు నేయించుకునేందుకు రూ.1500- రూ.2వేల వరకు ఖర్చవుతోంది. దీనికి తోడు తాటాకులు కుట్టడానికి కూలీలకు రూ.2వేలు చెల్లించాలి. మొత్తం ఒక ఇంటిని నేయించాలంటే రూ.8 వేల నుంచి 10 వేల వరకు ఖర్చవడంతో పేదలు హడలిపోతున్నారు. రెక్కాడితేనే కానీ డొక్కాడని పేదలు ఇంటి నిమిత్తం ఇంత ఖర్చు చేయాలంటే ఆర్థికంగా ఇబ్బందులుపడుతున్నారు. గతంలో వంద తాటాకులు రూ.800-1000 ఉండేవి. ఇటుకబట్టిలా పుణ్యమా అని ఈ తాటి చెట్లను తొలగించి ఇటుకల ఆవకు ఉపయోగించుకుంటున్నారు. దీంతో తాటాకులకు డిమాండ్ ఏర్పడింది. గతంలో ప్రతీ చేలగట్టు, పుంతరోడ్ల పక్కన విస్తారంగా ఉండే తాటిచెట్లు నేడు అక్కడక్కడ మాత్రమే దర్శనమిస్తున్నాయి. రైతులు పంటలకు నీడవస్తుందని, నష్టాలు వస్తున్నాయనే నెపంతో తాటిచెట్లు నరికివేయడంతో కనుమరుగవుతున్నాయి. తాటాకులను, మెట్ట, ఏజెన్సీ ప్రాంతాల నుంచి లారీలు, వ్యాన్‌లపై తీసుకువచ్చి అమ్మకాలు చేస్తున్నారు. ఖర్చులు అధికమవడం వలనే ధరలు పెరిగాయని లాభాలు అంతంతమాత్రమేనని కేవలం కూలి ఖర్చులు మాత్రమే వస్తాయని అమ్మకందారులు చెబుతున్నారు.

పట్టిసీమ పరవళ్లు ఏవీ..?

● సాగు నీటి కోసం రైతుల ఎదురుచూపు ● గోదావరి నీటిమట్టంపై అధికారుల దృష్టి


పట్టిసీమ ఎత్తిపోతల పథకం డెలివరీ చానల్

పోలవరం, జూన్ 25: పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా పోలవరం ప్రాజెక్టు కుడి కాలువకు పూర్తిస్థాయిలో నీరంది దాదాపు ఆరేళ్లు కావస్తోంది. ప్రస్తుతం సార్వా సీజన్ ఆరంభం కావడం, టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో చేలకు పట్టిసీమ నీరందుతుందని రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. రైతుల ఆకాంక్ష, ప్రభుత్వ విధానాల మేరకు అధికార యంత్రాంగం కూడా ఈ మేరకు సమాయత్తం అవుతున్నారు. గోదావరి నీటి మట్టం పరిశీలించి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పట్టిసీమ ఎత్తిపోతల ద్వారా నీరందించేందుకు అధికారులు పరిశీలిస్తున్నారు.

గతంలో టీడీపీ పాలనలో పట్టిసీమ ఎత్తిపోతల పథకాన్ని యుద్ధప్రాతిపదికన ఏడాదిలో నిర్మించి 2019లో కృష్ణా రాయలసీమ, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల్లో సుమారు 4 లక్షల ఎకరాలకు 305.07 టీఎంసీల సాగు నీరందించారు. రైతులు ఏడాదికి మూడు పంటలు పండించుకునే అవకాశం కల్పించారు. తర్వాత వైసీపీ పాలనలో 2020 జూన్ నుంచి నవంబరు 24 వరకూ 4.5424 టీఎంసీలు, 2021లో 1.6417 టీఎంసీలు, 2023లో 58.7421 టీఎంసీల నీరు పంపిణీ చేశారు. అరకొర నీటి విడుదలతో 4 లక్షల ఎకరాల రైతులకు నిరాశే మిగిలింది.

తిరిగి టీడీపీ కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో పట్టిసీమ ద్వారా సాగు నీరందుతుందని రైతులు ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం గోదావరి నీటిమట్టం పట్టిసీమ వద్ద 13.28 మీటర్లు మాత్రమే ఉంది. వర్షపాతం లేకపోవడంతో గోదావరి నీటిమట్టం పెరగలేదు. దీనితో పట్టిసీమ ఎత్తిపోతల నుంచి నీరందే అవకాశాలు కానరావడం లేదు. సోమవారం సీలేరు నుంచి గోదావరికి 2వేల క్యూసెక్కుల జలాలు విడుదల చేసినప్పటికీ గోదావరిలో నీటిమట్టం అంతంత మాత్రంగానే ఉంది. స్పిల్‌వే వద్ద క్రస్ట్ లెవెల్‌కు నీరు పెరగకపోవడం స్లూయిజ్‌ల ద్వారా మాత్రమే నీటి పంపిణీ జరుగుతున్న క్రమంలో దిగువ నీటిమట్టం పెరగడం లేదు. ప్రాజెక్టు కుడి కాలువ పరిధిలో ఇప్పటికే ఆకుమడులు వేసుకున్న రైతులు ఆశగా పట్టిసీమ నీటికోసం ఎదురు చూస్తున్నారు. అధికారులు స్పందించి ప్రాజెక్టు ఎగువ ఉన్న ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేసి పట్టిసీమ సాగు నీటి పంపిణీ ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. గూటాల పంపింగ్ స్కీంలో 2400 ఎకరాల్లో నారుమడులకు 15 రోజుల నుంచి ఒక్క మోటారుతో నీటిని అరకొరగా పంపిణీ చేస్తున్నారు. దీనితో కొంతమేర నారుమడులను నీరందుతోంది. పట్టిసీమ నీరొచ్చినా, గోదావరి నీటి మట్టం పెరిగినా వర్షాలు కురిసేలోపు నారుమడులు సిద్ధమవుతాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఎత్తిపోతల నుంచి నీటి విడుదలపై పట్టిసీమ డీఈ పెద్దిరాజును వివరణ కోరగా నీటిమట్టం 14 మీటర్లకు పైబడి ఉంటే నీరు విడుదలకు అవకాశం ఉంటుందన్నారు. నీటి మట్టం ఆధారంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నీరు విడుదల చేస్తామన్నారు.

ఆగని ఇసుక దోపిడీ



- ప్రభుత్వం మారినా ఆగని దందా
- ప్రేక్షకపాత్ర వహిస్తున్నఅధికారులు
- గాడి తప్పుతున్న పాలన
- తూర్పుగోదావరిలో ఊడ్చేశారు
- పశ్చిమలో నేటి నుంచి తవ్వకాలు
- ఉచిత ఇసుక నిర్ణయం వెల్లడించాలి
- అధిష్ఠానం దృష్టి పెట్టకుంటే అభాసుపాలు

పాలకొల్లు, జూన్ 25: కూటమి ప్రభుత్వం కొలువు తీరినా ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో ఇసుక కష్టాలకు తెరపడలేదు. ఐదారు రోజులుగా ఇసుకాసురులు రెచ్చిపోయి, స్టాక్ పాయింట్లలో పర్వతాల మాదిరిగా వున్న ఇసుక నిల్వలను అక్రమంగా అమ్మేశారు. లాలాచెరువు ప్రాంతంలో లక్ష టన్నుల ఇసుక నిల్వలను రెండు రోజుల్లో ఊడ్చేశారు. గోపాలపురం ర్యాంపులో రాత్రి వేళల్లో రోజుకు 200 లారీల ఇసుకను తవ్వేస్తున్నారు. పులిదిండి ర్యాంపులోనూ అదే పరిస్థితి, రావులపాలెం, వేమగిరి స్టాక్ పాయింట్ల నుంచి ఇసుకను యథేచ్ఛగా అమ్మేస్తున్నారు. బల్లిపాడు, కుమారదేవం ప్రాంతాల్లో నిర్భయంగా ఇసుక అమ్మకాలు జరుగుతున్నాయి. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పెండ్యాలలోని స్టాక్ పాయింట్లలో రెండు రోజుల నుంచి ఇసుక అమ్మకాలు జరుగుతున్నాయి. నడిపూడి, కరుగోరుమిల్లి ర్యాంపులలో ఇసుక దోపిడీకి ముహూర్తానికి కొబ్బరికాయ కొట్టారు. ఈ ర్యాంపులలో నేటి నుంచి ఇసుక తవ్వకాలు ప్రారంభమవుతాయని చెబుతున్నారు. మొత్తంగా నూతన ప్రభుత్వం కొలువుదీరినా 4, 5 రోజుల వ్యవధిలోనే కోట్లాది రూపాయల ఇసుక బొక్కేశారు. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే ఇసుక దందా ఆగుతుందని ప్రజలు ఆశించారు. అయితే ఇసుకాసురులు మాత్రం నూతన ప్రభుత్వ పాలన ఆరంభంలోనే చిలక్కొట్టుడుకు శ్రీకారం చుట్టారు.

అధికారుల ప్రేక్షక పాత్ర

నాటి జగన్ పాలనలో అక్రమాలకు పూర్తిస్థాయిలో తెరతీసిన అధికార యంత్రాంగం అదే ధోరణి అవలంబించడం సర్వత్రా అనుమానాలకు తావిస్తోంది. ఈ అక్రమ ఇసుక అమ్మకాల వెనుక ఎవరి హస్తం ఉందనేది క్షేత్రస్థాయిలో దర్యాప్తు చేసి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి.

ఉచిత ఇసుకపై నిర్ణయం తీసుకోవాలి

ఉచిత ఇసుకపై ప్రభుత్వం రోజుల వ్యవధిలోనే నిర్ణయం తీసుకోవాలని ప్రజలు ఆశిస్తున్నారు. లేకుంటే ఇసుక మాఫియా మరింత రెచ్చిపోయే అవకాశం ఉంది. కూటమి ప్రభుత్వం ఇసుక అక్రమ అమ్మకాలపై దృష్టి పెట్టాలని పరిశీలకులు సూచిస్తున్నారు.

ఇసుక అక్రమ అమ్మకాలు ఇలాగే కొనసాగితే నూతన ప్రభుత్వం అప్రదిష్ట పాలవుతుందని కూటమి శ్రేణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, సంబంధిత మంత్రి ఇసుక అక్రమ అమ్మకాలపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



కేవీపీఎస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద ఆందోళన

దళితులపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

భీమవరం క్రైం, జూన్ 25: అర్ధరాత్రి సమయంలో వెంప దళిత పేటలపై కత్తులు, కర్రలతో దాడిచేసి, దళిత యువతిపై అత్యాచారయత్నం చేసిన వారిని తక్షణం అరెస్టు చేసి, దళితులకు రక్షణ కల్పించాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు కోరారు. కేవీపీఎస్ ఆధ్వర్యంలో బాధితులు మంగళవారం ఎస్పీ వి.అజితకు వినతిపత్రం అందజేశారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. క్రాంతిబాబు మాట్లాడుతూ ఈనెల 23న కొంత మంది యువకులు దళిత యువకులతో వాగ్వివాదానికి దిగి దాడి చేశారన్నారు. దళితులపై దాడి చేసిన వారిపై ఎస్సీ ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం ఎస్సీ అట్రాసిటీ చట్ట ప్రకారం కేసు నమోదు చేసి, వారిని వెంటనే అరెస్టు చేయాలన్నారు. అత్యాచార యత్నం చేసిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ఘటనపై బాధితులు డీఎస్పీని కలవడానికి వెళ్లినా కనీసం స్పందించకపోవడం దారుణమన్నారు.

దాడి సంఘటనపై దర్యాప్తు చేస్తాం : ఎస్పీ

ఈ సంఘటనపై ఏఎస్పీ ఆధ్వర్యంలో నరసాపురం, భీమవరం డీఎస్పీలతో ఒక కమిటీ వేస్తామని, దర్యాప్తు చేసి దోషులపై చర్యలు తీసుకుంటామని ఎస్పీ అజిత వేజెండ్ల హామీ ఇచ్చారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బాధితులకు హామీ ఇచ్చారు. కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు బత్తుల విజయ్‌కుమార్, సీఐటీయూ మండల నాయకులు పెద్దపాటి శ్యామల, ఇంజేటి శ్రీనివాస్, బాధిత గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

1 నుంచి కొత్త న్యాయ చట్టాల అమలు

ఏలూరు జిల్లా ఏఎస్పీ స్వరూపరాణి


ఏఎస్పీ జి.స్వరూపరాణి

జంగారెడ్డిగూడెం, జూన్ 25: కొత్త న్యాయ చట్టాలు జూలై 1 నుండి అమలులోకి వస్తున్నాయని ఏలూరు జిల్లా ఏఎస్పీ జి.స్వరూప రాణి తెలిపారు. జంగారెడ్డిగూడెం డీఎస్పీ కార్యా లయాన్ని మంగళవారం ఆమె పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటివరకు అమలులో ఉన్న సీఆర్పీసీ, ఐపీసీ, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ తదితర చట్టాలను మార్చుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. వీటి స్థానంలో జూలై 1 నుంచి భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బీఎస్ఎస్), భారతీయ సాక్ష్యా అధినియం చట్టం (బీఎస్ఎ) అమలులోకి రానున్నాయని తెలిపారు. ఈ చట్టాలపై ఇప్పటికే తమ సిబ్బందికి శిక్షణ ఇచ్చామన్నారు. డివిజన్ పరిధిలో 90శాతం సిబ్బంది శిక్షణ పొందారని తెలిపారు. ఇదిలా ఉండగా బంగారం, వాహనాలు తదితర చోరీల్లో రికవరీలు పెరుగుతున్నాయన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పుడు రికవరీలలో కొంత మేర జాప్యం జరిగిందన్నారు.

ఐదు రోజులుగా వర్షాల జోరు

అత్యధికంగా కైకలూరు మండలంలో 26.2 మి.మీ వర్షపాతం

ఏలూరు సిటీ, జూన్ 25: జిల్లాలో నైరుతి రుతుపవనాల ప్రభావం ఇప్పుడిప్పుడే కనిపిస్తోంది. ఐదు రోజులుగా వర్షాలు పడుతున్నాయి. సోమవారం రాత్రి ఏలూరు జిల్లాలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురిశాయి. వర్షాల రాకతో సార్వా పనులు ముదుకు సాగుతున్నాయి. గడిచిన 24 గంటల్లో జిల్లాలో అత్యధికంగా కైకలూరు మండలంలో 26.2 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. మంగళవారం జిల్లాలో 35 డిగ్రీల సెంటీగ్రేడ్ పగటి ఉష్ణోగ్రత నమోదైంది. గడిచిన 24 గంటల్లో సరాసరి వర్షపాతం 5.7 మిల్లీమీటర్లుగా నమోదైంది. మిగిలిన మండలాల్లో వివరాలివి.. బుట్టాయిగూడెంలో 25.4, మండవల్లి-16.4, టి.నరసాపురం -15, చింతలపూడి-14, పోలవరం-12, పెదవేగి-8.4,, జీలుగుమిల్లి-8.2, ఆగిరిపల్లి-8.2, కలిదిండి-6.2, జంగారెడ్డిగూడెం-5.6, చాట్రాయి-4.6, నూజివీడు-2.4, ఉంగుటూరు-2.4, పెదపాడు-1.4, భీమడోలు-1.2, లింగపాలెం-0.4, ఏలూరు అర్బన్‌లో 0.2 మిల్లీమీటర్లు వర్షపాతాలు నమోదయ్యాయి.

ఎమర్జెన్సీతో నిరంకుశ పాలన

49 ఏళ్ల నాటి పరిస్థితులపై బీజేపీ నేత పాకా

భీమవరం టౌన్, జూన్ 25: దివంగత ప్రధాని ఇందిరాగాంధీ 1975లో ఎమర్జెన్సీ విధించి నిరంకుశ పాలన సాగించారని బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ చైర్మన్ పాకా వెంకట సత్యనారాయణ అన్నారు. 1975 జూన్ 25న ఎమర్జెన్సీ విధించి 49 ఏళ్లు కావడంతో మంగళవారం ఆయన పార్టీ శ్రేణులకు ఎమర్జెన్సీ నాటి పరిస్థితులు వివరించారు. కాంగ్రెస్ పార్టీ నిరంకుశ పాలన, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని చేసిందని అన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు నార్ని తాతాజీ మాట్లాడుతూ ఎమర్జెన్సీలో ఎంతో మంది నాయకులను అరెస్టుచేసి జైళ్లలో పెట్టారన్నారు. ఉద్దరాజు వేణుగోపాల్ రాజు అప్పటి పరిస్థితులు వివరించారు. పేరిచర్ల సుభాష్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోట రాంబాబు, ఉన్నమట్ల కబర్ధి, కోమటి రవికుమార్, అల్లూరి సాయి దుర్గరాజు కొవ్వూరి వెంకట రెడ్డి, భీమవరం నియోజకవర్గ కన్వీనర్ కాగిత సురేంద్ర, కోరా రామ్మూర్తి, అరసవల్లి సుబ్రహ్మణ్యం ఆకుల లీలా కృష్ణ, కురెళ్ల నరసరావు, రత్నాల సత్యనారాయణ కోడి నరసింహ, అడబాల శివ, పితాని వేంకటేశ్వరరావు, మొహిద్దిన్, వేలూరి వెంకట రామయ్య శర్మ, గోవర్ధన్ జిల్లా బీజేపీ నాయకులు కార్యకర్తలు, ఐటిఐ కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

బాలికపై అత్యాచారం కేసులో నిందితుడి అరెస్టు


నిందితుడి వివరాలు చెబుతున్న ఏలూరు డీఎస్పీ శ్రీనివాసులు

ముదినేపల్లి, జూన్ 25: వివాహితతో సహజీవనం సాగిస్తూ ఆమె కుమార్తెపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడు మఖవరపు ఉదయ్ కుమార్ (41)ను ముదినేపల్లి పోలీసులు అరెస్టు చేశారు. ఏలూరు డీఎస్పీ ఇ.శ్రీనివాసులు, కైకలూరు రూరల్ సీఐ కృష్ణ కుమార్, ముదినేపల్లి ఎస్ఐ వెంకట్ కుమార్, సిబ్బంది నిందితుడిని ద్వారకా తిరుమల మండలం పి.కన్నాపురంలో మంగళవారం అరెస్టు చేశారు. అనంతరం ముదినేపల్లి పోలీస్ స్టేషన్‌లో నిందితుడిని మీడియా ముందు ప్రవేశ పెట్టారు. డీఎస్పీ కేసు వివరాలు తెలిపారు. నిందితుడు ఉదయ్ కుమార్ హైదరాబాద్‌లో నివాసం ఉంటూ తరచూ ముదినేపల్లి మండలంలోని ఓ గ్రామానికి తన బంధువుల ఇంటికి వస్తుండేవాడు. ఆ గ్రామంలోని ఒంటరి మహిళతో ఏడాదిగా సహజీవనం సాగిస్తున్నాడు. ఆమె నుంచి రూ.2.20 లక్షలు కూడా తీసుకున్నాడు. అంతేకాక ఆమె పదేళ్ల కుమార్తెపై పలుసార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ నేపథ్యంలో మే నెల 18న తెల్లవారుజామున బాలికపై లైంగిక దాడికి పాల్పడగా తల్లి గమనించడంతో ఆమెను కొట్టి బెదిరించి వెళ్లిపోయాడు. అనంతరం గ్రామస్థులు కొందరు నిందితుడి తరఫున రాజీ చేసి ఆమె వద్ద తీసుకున్న రూ.2.20 లక్షలు తిరిగి ఇప్పిస్తామని, ఈ ఘటనపై కేసు పెట్టవద్దని చెప్పారు. ఈ నెల 16న మధ్యవర్తులతో కలసి ఉదయ్ కుమార్ ఆ మహిళ ఇంటికి వెళ్లి రాజీకి ఒత్తిడి చేశారు. ఆమె అంగీకరించకపోవడంతో దాడి చేశారు. దీనిపై ఈ నెల 17న కేసు నమోదు చేయగా, ఏలూరు దిశ పోలీస్‌స్టేషన్ డీఎస్పీ మురళీకృష్ణ దర్యాప్తు చేశారు. ప్రధాన నిందితుడు ఉదయ్ కుమార్‌ను మంగళవారం అరెస్టు చేయగా, మిగిలిన నలుగురిని కూడా అరెస్టు చేస్తామని డీఎస్పీ తెలిపారు. కేసు దర్యాప్తులో ముదినేపల్లి హెచ్‌సీ శంకర్‌రావు, కానిస్టేబుల్ బి.నాగబాబును డీఎస్పీ అభినందించారు.

సర్పంచ్ భర్త లైంగిక వేధింపులు

ముసునూరు, జూన్ 25: సర్పంచ్ భర్త తనపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడన్న బాధితురాలి ఫిర్యాదుపై ముసునూరు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. మండలంలోని గ్రామానికి చెందిన మహిళ సోమవారం ఇంట్లో ఒంటరిగా ఉండగా సర్పంచ్ భర్త రంగు గాంధీ లైంగిక వేధింపులకు దిగాడు. ఆమె కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు రాగా నిందితుడు పారిపోయాడని బాధితురాలు ఫిర్యాదు చేసినట్టు ఎస్ఐ పి.వాసు తెలిపారు. గతంలో తనను గాంధీ వేధింపులకు గురి చేయగా, పోలీసులకు ఫిర్యాదు చేశానని, కేసు నమోదు చేసినా న్యాయం చేయలేదని ఆరోపించింది. నిందితుడిపై చర్యలు తీసుకుని, తనకు రక్షణ కల్పించాలని కోరింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వాసు తెలిపారు.

ఫిట్స్‌తో హైస్కూల్ విద్యార్థిని మృతి


గోపికా నందిని (ఫైల్)

పోడూరు, జూన్ 25: హైస్కూల్ విద్యార్థిని తరగతి గదిలో ఫిట్స్‌తో అపస్మారకస్థితికి చేరడంతో ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందింది. పోడూరు కల్నల్ డీఎస్.రాజు జడ్పీ హైస్కూల్‌లో జరిగిన సంఘటన ఆల స్యంగా వెలుగుచూసింది. హైస్కూల్ హెచ్ఎం ఐ.జనార్దనరాజు, విద్యార్థిని బంధువులు తెలిపిన వివరాల ప్రకారం 9వ తరగతి విద్యార్థిని చెల్లబోయిన అనుషా గోపికానందిని (14) సోమవారం స్కూల్‌కు వచ్చింది. మధ్యాహ్న భోజన విరామం అనంతరం ఫిట్స్ రావడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. తోటి విద్యార్థినులు ఉపాధ్యాయులకు తెలియజేయడంతో సపర్యలు చేసి విద్యార్థిని తాతయ్య కండిబోయిన భాస్కరరావుకు సమాచారమిచ్చారు. ఆటోలో స్థానిక పీహెచ్‌సీకి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం పాలకొల్లు ప్రభుత్వాసుపత్రికి 108 వాహనంలో తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. ఆమె తండ్రి కొవిడ్‌లో మృతిచెందాడు. తల్లి లక్ష్మి ఇద్దరు కుమార్తెలను తీసుకొని వేడంగి నుంచి పోడూరులో పుట్టింటికి వచ్చింది. ఇద్దరు కుమార్తెలను తల్లిదండ్రులకు అప్పగించి జీవనోపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లింది. పెద్దకుమార్తె కుసుమ పావని తనూజ ఇంటర్ చదువుతోంది. చలాకీగా ఉండే నందిని కళ్ల ముందే మృతి చెందడంతో హైస్కూల్, గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

బస్సులో ప్రయాణికుడి మృతి

మృతుడిది తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ

జంగారెడ్డిగూడెం, జూన్ 25 : ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ఏటుకూరి అప్పారావు (55) అస్వస్థతతో బస్సులోనే మృతిచెందిన ఘటన మంగళ వారం జరిగింది. ఆర్టీసీ డీఎం పి.గంగాధరరావు తెలిపిన వివరాల ప్రకారం తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ గ్రామానికి చెందిన ఏటుకూరి అప్పా రావు బత్తాయి పండ్ల బుట్టలు కట్టే పనికి మంగళవారం కామవరపుకోట వచ్చాడు. అప్పటికే అతడికి ఒంట్లో బాగోకపోవడంతో తోటి కార్మికులు తిరిగి కోరుకొండ వెళ్లిపోవాలని సూచించారు. అప్పారావు స్వగ్రామం కోరుకొండ వెళ్లడానికి కామవరపుకోటలో జంగారెడ్డిగూడెం వెళ్లే బస్సు ఎక్కాడు. కామ వరపుకోట దాటగానే కండక్టర్ టిక్కెట్ కోసం అప్పారావు దగ్గరకు వెళ్లగా అతనిలో చలనం లేదని గ్రహించాడు. అపస్మారక స్థితిలో ఉన్నాడని భావిం చి జంగారెడ్డిగూడెం సమీపిస్తుండగా 108 అంబులెన్సుకు కండక్టర్ సమాచా రం ఇచ్చారు. బస్సు జంగారెడ్డిగూడెం చేరుకోగానే అంబులెన్స్ సిబ్బంది పరిశీలించి అప్పారావు చనిపోయినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించగా డాక్టర్లు సాధారణ మరణం అని నిర్ధారించారు. బంధువులకు సమాచారమందించగా మృతదేహాన్ని అంబులెన్సులో స్వగ్రామం తీసుకువెళ్లినట్లు ఆర్టీసీ డీఎం పి.గంగాధరరావు తెలిపారు.

గల్లంతైన మణికంఠ మృతదేహం లభ్యం


మణికంఠ (ఫైల్)

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 25: ఏలూరు కాలువలో ఆదివారం గల్లంతైన పడాలకు చెందిన వానపల్లి మణికంఠ (14) మృతదేహం మంగళవారం లభ్యమైంది. కాలువ సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద మృతదేహం బయటపడింది. మూడు రోజులుగా మణికంఠ మృతదేహం కోసం అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభించలేదు. మంగళవారం ఎన్డీఆర్ఎఫ్ బృందాలు రంగంలోకి దిగి గాలింపు చర్యలు ముమ్మరం చేయడంతో మణికంఠ మృతదేహాన్ని గుర్తించారు. మణికంఠ ఆచూకీ కోసం ఎదురు చూస్తున్న తల్లిదండ్రులు కొడుకు విగతజీవిగా కనబడడంతో కన్నీరు మున్నీరయ్యారు. తల్లిదండ్రుల రోదన స్థానికులను కంటతడి పెట్టించింది.

ఆర్థిక ఇబ్బందులతో మహిళ ఆత్మహత్య

కామవరపుకోట, జూన్ 25: కామవరపుకోట పంచాయతీ కొత్తూరు గ్రామానికి చెందిన షేక్ సల్మ(20) ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తడికలపూడి ఎస్ఐ జయబాబు మంగళవారం వివరాలు తెలిపారు. సల్మ భర్త రెండేళ్ళ క్రితం కొవిడ్‌తో మృతి చెందాడు. సల్మ ఇద్దరు పిల్లలతో ఒక హోటల్‌లో పనిచేసుకుంటూ జీవిస్తుంది. ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జంగారెడ్డిగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరివేసుకుని గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

నరసాపురం రూరల్, జూన్ 25: మండలంలోని లక్ష్మణేశ్వరం పంచాయతీ పరిధిలో కంపోస్టుయార్డు వద్ద గుర్తు తెలియని వ్యక్తి చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మంగళవారం ఉదయం గమనించిన స్థానికులు వీఆర్వో చిరంజీవికి సమాచారం ఇచ్చారు. రంగంలోకి దిగిన పోలీసులు మృత దేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

కుమార్తె కనిపించడం లేదని తల్లి ఫిర్యాదు

పెదపాడు, జూన్ 25: తన కుమార్తె కనిపించడంలేదని నాయుడుగూడెం గ్రామానికి చెందిన కతారి రంగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. ఇంటర్ ఫెయిలైన నాగ రాజ్యలక్ష్మి ఇంటి నుంచి వెళ్లిపోయింది. చుట్టుపక్కల వెతికి ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై కె.శుభశేఖర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కోడలిపై అత్త ఫిర్యాదు

తనను కొట్టిందని కోడలిపై అత్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు పెదపాడు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. సకలకొత్తపల్లి గ్రామానికి చెందిన యమ్మల దుర్గాంబను కోడలు దివ్య కొట్టినట్లు అత్త పెదపాడు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సై కె.శుభశేఖర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కోళ్లవ్యర్థాల వాహనం సీజ్

పెదపాడు, జూన్ 25: చేపల చెరువుల్లో మేతగా వేసేందుకు కోళ్లవ్యర్థాలను తరలిస్తుండగా తనిఖీలు నిర్వహించి కోడి వ్యర్థాలతో కూడిన వాహనాన్ని పెదపాడు పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. వాహన, చెరువు యజమానులతో పాటుగా డ్రైవర్‌పై పెదపాడు పోలీసులు కేసు నమోదు చేసి ఎస్సై కె.శుభశేఖర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రైవేట్ పాఠశాల వద్ద ఆందోళన



పాఠశాల వద్ద బైఠాయించిన డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు

ఆకివీడు, జూన్ 25: విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యం కారణంగా ప్రైవేటు పాఠశాలలు విద్యను వ్యాపారంగా చేస్తున్నారని డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ శ్రేణులు ఆగ్రహించారు. నిబంధనలకు విరుద్ధంగా స్థానిక నారాయణ హైస్కూల్‌లో విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం, షూలు అమ్ముతున్నారని ఎంఈవో రవీంద్రకు ఫోన్‌చేసినా స్పందించలేదు. దీనితో గది దగ్గర స్టూడెంట్ నాయకులు బైఠాయించారు. ఎంఈవో-2 సీతారామయ్య పాఠశాలకు వచ్చారు. ప్రిన్సిపాల్, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నేతలతో మాట్లాడి పుస్తకాలు అమ్ముతున్న గదికి సీల్‌వేసి సీజ్ చేశారు. అదే సమయానికి పాఠశాలకు వచ్చిన పేరెంట్స్ ఫీజులు అధికంగా వసూల్ చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గేదెల ధనుష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.ప్రసాద్, ఎన్ సాయిఫణి పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు అందజేత

ఉండి, జూన్ 25: ఉప్పరగుడెం, ఉత్తరపాలెం, రామచంద్రపురం, చిలుకూరు స్పెషల్ పాఠశాలల్లోని విద్యార్థులకు భోజనం ప్లేట్లను లయన్స్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వేగేశ్న అనంతలక్ష్మి, కన్నెగంటి రూత్‌కళ అందించారు. ఉండి మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ సాగిరాజు సాంబశివరాజు సూర్యకుమారి దంపతుల ఆర్థిక సహాయంతో వీటిని అందించారు.

అవగాహనతో డ్రగ్స్‌ను నివారిద్దాం



నరసాపురం టౌన్, జూన్ 25: డ్రగ్స్‌కు బానిసై ఎందరో జీవితాలను నాశనం చేసుకున్నారని, వీటికి బానిసకాకుండా సమాజంలో చైతన్యం తీసుకొచ్చేందుకు విద్యార్థులు నడుం బిగించాలని 7ఆంధ్రా నావెల్ యూనిట్ కమాండర్ రోహిత్‌కుమార్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ఎన్‌సీసీ, నేవి కేడెట్‌లు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. వైఎన్ కాలేజీ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ పురవీధుల్లో సాగింది.

రైతు బజార్‌లో రైతులే విక్రయించాలి



నాయకర్‌ను సన్మానిస్తున్న బీసీ సంఘ నాయకులు

నరసాపురం రూరల్, జూన్ 25: సరిపల్లి మార్కెట్ యార్డును మంగళవారం ఎమ్మెల్యే నాయకర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గొడౌన్లను పరిశీలించి, మార్కెట్ ఆదాయ వనరుల ఆదాయాన్ని ఆరా తీశారు. గతం కంటే ఆక్వా ఎగుమతుల ద్వారా వచ్చే పన్నులు ఎందుకు తగ్గాయంటూ ప్రశ్నించారు. చెక్ పోస్టుల వద్ద అవినీతి జరగకుండా చూడాలన్నారు. మార్కెట్ ఆదాయాన్ని పెంచేందుకు కృషి చేయాలన్నారు. రైతు బజార్లలో రైతులే విక్రయాలు జరపాలన్నారు. తరుచూ బజార్‌ను సిబ్బంది తనిఖీ చేయాలన్నారు. అంతకు ముందు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనమాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.

ఇచ్చిన హామీలను అమలు చేస్తాం

నరసాపురం టౌన్, జూన్ 25: ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందని టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు అన్నారు. మంగళవారం ఆయన్ను నియోజకవర్గ బీసీ విభాగం నాయకులు కలిసి ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేసినందుకు అభినందించారు. ఈసందర్భంగా పొత్తూరి మాట్లాడుతూ రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణం దేశంలోనే అగ్రగామిగా నిలుస్తుందన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రంలో అంతా దోపిడినే జరిగిందన్నారు. త్వరలో ఆరు గ్యారెంటీలు అమల్లోకి వస్తాయన్నారు. ఈకార్యక్రమంలో జక్కం శ్రీమన్నారాయణ, పెండ్ర శ్రీను, కొప్పాడి సత్యనారాయణ, దేశెట్టి సత్యనారాయణ, నాగబాబు, మల్లాడి మూర్తి, తాడి భువన్‌లు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసరాలు పంపిణీ

నరసాపురం టౌన్, జూన్ 25: పట్టణంలోని 7వ వార్డులో కొవ్వలి ట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం పేదలకు ఉచితంగా బియ్యం, నిత్యావసరాలు పంపిణీ చేశారు. వీటిని సంకు భాస్కర్ అందించారు. రెండేళ్ళ నుంచి ట్రస్టీ చైర్మన్ కొవ్వలి నాయుడు పేదలకు, వైద్యం చేయించుకోలేని రోగులకు మందులతో పాటు ప్రతి నెల నిత్యావసరాలు అందించడం అభినందనీయమన్నారు.

రైల్వే అధికారులకు వినతి పత్రం అందజేత

భీమవరం క్రైం, జూన్ 25 : రద్దయిన రైళ్ల కారణంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని, ప్రత్యామ్నాయ మార్గాలను చూడాలని సీపీఐ, సీపీఎం నాయకులు ఎం.సీతారాంప్రసాద్, వైకుంఠరావు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. భీమవరం హౌసింగ్‌బోర్డు కాలనీ డెవలప్‌మెంట్ కమిటీ, సీపీఐ, సీపీఎం, లయన్స్‌క్లబ్, శ్రీవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో భీమవరం జంక్షన్ రైల్వే స్టేషన్లో మంగళవారం నాడు స్టేషన్ సూపరింటెండెంట్‌కు వినతి పత్రాన్ని అందించి రైల్వే డీఎంలకు ఫ్యాక్స్ ద్వారా వినతి పత్రాన్ని అందించే కార్యక్రమం నిర్వహించారు.

ముగిసిన వాలీబాల్ కోచింగ్



క్రీడాకారునికి బహుమతిని అందిస్తున్న పాండు రంగరాజు, గాదిరాజు బాబు

భీమవరం ఎడ్యుకేషన్, జూన్ 25 : డీఎన్నార్ కళాశాల క్రీడా మైదానంలో వాలీబాల్ కోచింగ్ క్యాంప్ ముగిసింది. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ ఉపాధ్యక్షులు గోకరాజు పాండురంగరాజు, గాదిరాజు సత్యనారాయణ రాజు మాట్లాడుతూ క్రీడలలో శిక్షణ చాలా అవసరమని దానితోనే క్రీడాకారులు ప్రతిభ చాటుతున్నారన్నారు. అనంతరం క్రీడాకారులకు బహుమతులు అందించారు. ఈకార్యక్రమంలో మంతెన కృష్ణంరాజు, పవన్‌కుమార్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

దాళ్వా బకాయిలు చెల్లించాలి



పెంటపాడు, జూన్ 25: రైతులకు ధాన్యం బకాయి సొమ్ము జమ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కళింగ లక్ష్మణరావు అన్నారు. ఆకుతీగపాడులోని రైతు భరోసా కేంద్రం వద్ద మంగళవారం రైతులతో కలసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో రైతులు దాళ్వా ధాన్యం అమ్మకాలు జరపగా కొందరికి నామమాత్రంగా సొమ్ము వేశారని, చాలా మందికి చెల్లించలేదన్నారు. దీంతో సార్వాకు పెట్టుబడులు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మాజీ సర్పంచ్ బుద్దన ధనరాజు, వంకా అప్పారావు, వంకా రామకృష్ణ, కొణతల నాగరాజు, జాలపర్తి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ వద్ద అన్నసమారాధన

తాడేపల్లిగూడెం అర్బన్, జూన్ 25: పట్టణంలోని తాలూకా సెంటర్ సమీపంలో ఉన్న అన్న క్యాంటీన్ వద్ద మంగళవారం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు. టీడీపీ నాయకుడు పొన్నాడ శ్రీనివాస్ తన కుమారుడు హేమంత్ పుట్టిన రోజు సందర్భంగా అన్నసమారాధన నిర్వహించారు. పట్నాల రాంపండు, దాసరి కృష్ణవేణి, సత్నీను కృష్ణమోహన్, సురగాల రాంబాబు, ముప్పిడి రమేష్ తదితరులు పాల్గొన్నారు.





అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ.. ఎమ్మెల్యే ఆరిమిల్లిని సత్కరిస్తున్న ప్రైవేటు స్కూల్సు, కాలేజీల యాజమాన్యాలు.. తాడేపల్లిగూడెంలో రహదారి మరమ్మతు పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

రహదారుల నిర్మాణానికి ప్రతిపాదనలు: పితాని

పోడూరు, జూన్ 25: తూర్పు పశ్చిమగోదావరి జిల్లాలను అనుసంధానం చేస్తూ కోడేరు- పి.గన్నవరం నేషనల్ హైవే కనెక్టవిటీ, అయోధ్యలంక పుచ్చల లంక బ్రిడ్జ్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ మంగళవారం ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. కొమ్ముచిక్కాలలోని ఆయన నివాసంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. గతంలో నిర్వహించిన రా కదిలిరా బహిరంగ సభలో చంద్రబాబునాయుడు గోదావరి లంక ప్రజల చిరకాల స్వప్నం గోదావరి బ్రిడ్జి నిర్మాణానికి చిత్తశుద్ధితో ఉన్నామని అధికారంలోకి రాగానే నిధులు మంజూరు చేసి పూర్తి చేస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. దీనికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలో అధ్వానంగా ఉన్న ఆర్అండ్‌బీ రోడ్లు వర్షాకాలం రాకుండానే మరమ్మతులు చేపట్టాలన్నారు. దశల వారీగా అన్ని రోడ్లు నిర్మాణం చేపట్టేందుకు నిధులు సమకూరుస్తున్నట్లు తెలిపారు. సమీక్షలో ఆర్అండ్‌బీ ఈఈ ఎస్.లోకేశ్వరరావు, డిఈ ఎన్.సాంబశివరావు, ఏఈలు యశ్వంత్, టిఆర్‌వి.ప్రసాదు, కనకరాజు పాల్గొన్నారు.

జగన్ పాలనలో రైతులకు కష్టాలు: ఆరిమిల్లి

తణుకు, జూన్ 25: వైసీపీ పాలనలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జగన్ పాలనలో ధాన్యం ఎక్కడ విక్రయించుకోవాలో తెలియక, ఎరువుల సరైన పంపిణీ లేక ఇబ్బందులు పడ్డారన్నారు. సొసైటీలును నిర్వీర్యం చేశారని, కాలువల్లో డెక్క తొలగింపు లేదని, నీటి సంఘాలు లేకుండా చేశారన్నారు. మాజీ మంత్రి కారుమూరి ధాన్యం సేకరణ చేయించలేని స్థితిలో ఉండేవారని, గోనె సంచుల్లో సైతం పెద్ద ఎత్తున దోపిడీకి తెరలేపారని ధాన్యాన్ని, బియ్యాన్ని ఇతర రాష్ట్రాలకు పంపిణీ చేసి అనేక అక్రమాలకు పాల్పడ్డారని విమర్శించారు. దాళ్వా డబ్బులు త్వరలోనే జమ చేస్తామని, త్వరలోనే ధాన్యం బకాయిలు చెల్లింపులు జరుగుతాయన్నారు. నియోజకవర్గంలో 14 వేల 912 మంది రైతుల నుంచి లక్షా 23 వేల 899 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామన్నారు. 270 కోట్ల ధాన్యం బిల్లులు రావాల్సి ఉండగా 85 కోట్లు వచ్చాయని, మిగిలినవి త్వరలోనే చెల్లింపులు జరుగుతాయన్నారు. కూటమి నాయకులు కలగర వెంకటకృష్ణ, బసవ రామకృష్ణ, పితాని మోహన్, శ్రీదేవి, కొమ్మిరెడ్డి శ్రీను, తాతపూడి మారుతీరావు, ఒమ్మి రాంబాబు పాల్గొన్నారు.

ఆరిమిల్లికి సత్కారం

తణుకు, జూన్ 25: ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణను క్యాంపు కార్యాలయంలో ప్రైవేటు స్కూల్సు, కాలేజీల సంఘం ప్రతినిధులు సత్కరించారు. ఆయా సంస్థల యాజమాన్యాల ప్రతినిధులు పెన్మెత్స సుబ్బరాజు, ఎం.ఎస్.ఆర్. ఆంజనేయులు (ప్రగతి రాజా), బసవా రామకృష్ణ, విద్యాకాంత్ సుదాకర్ వర్మ, శ్రీమన్నారాయణ రెడ్డి, నిమ్మగడ్డ రాజేంద్రప్రసాదు, సత్యనారాయణ, రామ్‌ప్రసాదు, రాజశేఖర్, దీపక్, సుశాంక్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

శివాజీ ఖడ్గంతో సత్కారం

తణుకు, జూన్ 25: ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణను ఛత్రపతి శివాజీ ఖడ్గం, తలపాగాతో మంగళవారం షాలేమ్ పెన్ కార్నర్ అధినేత మిరియాల అమర్‌నాద్, బసవా రామకృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. గోపిరెడ్డి చిన్నారావు, ఇజ్రాయెల్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి చర్యలు : బొలిశెట్టి

తాడేపల్లిగూడెం అర్బన్, జూన్ 25: నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్టు ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో రూ.10 లక్షలతో చేపట్టిన రహదారి మరమ్మతు పనులను మంగళవారం మునిసిపల్ ఇన్‌చార్జి కమిషనర్ మురళీకృష్ణతో కలసి పరిశీలించి మాట్లాడుతూ వైసీపీ హయాంలో రహదారులన్నీ అధ్వానంగా మారినా పట్టించుకోలేదన్నారు. ప్రజల ఆకాంక్ష మేరకు నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా ముందుకు వెళ్తామన్నారు. జనసేన నాయకులు వర్తనపల్లి కాశి, పాలూరి వెంకటేశ్వరరావు, గుండుమోగుల సురేష్, కాళ్ళ గోపి, పైబోయిన చిన్న వెంకట రామయ్య, గురుజు సూరిబాబు, బయనపాలెపు ముఖేష్ పాల్గొన్నారు.





మంత్రులు నిమ్మల, సవితను అభినందిస్తున్న మాజీ ఎమ్మెల్సీ అంగర.. అచ్చెన్నాయుడుతో వలవల బాబ్జి.. నిమ్మలతో యలమంచిలి టీడీపీ నాయకులు

మంత్రులతో జిల్లా నాయకులు

పాలకొల్లు అర్బన్, జూన్ 25 : రాష్ట్ర మంత్రులుగా బాధ్యతలు స్వీకరించిన బీసీ వెల్ఫేర్ శాఖ మంత్రి సవిత, జలవనరుల శాఖమంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడును మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్ మంగళవారం వారి చాంబర్స్‌లో కలిసి అభినందించారు. అమరావతిలోని ఇంక పలువురు మంత్రులను అంగర కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

పోడూరు: వేడంగికి చెందిన బీజేపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి యర్రంశెట్టి పద్మారావు అమరావతిలో మంగళవారం విద్యా శాఖామంత్రి నారా లోకేశ్, ఇరిగేషన్ శాఖామంత్రి నిమ్మల రామానాయుడులను మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఇద్దరికీ పుష్పగుచ్ఛాలు అందచేసి అభినందనలు తెలిపారు.

యలమంచిలి: అమరావతిలోని మంత్రి ఛాంబర్‌లో మంగళవారం ఇరిగేషన్ శాఖామంత్రి నిమ్మల రామానాయుడును యలమంచిలి టీడీపీ నాయకులు కలిశారు. ఈసందర్భంగా మంత్రి నిమ్మలను నాయకులు సన్మానించారు. తాళ్లూరి శ్రీనివాస్‌బుజ్జి, తాళ్లూరి వెంకటేశ్వరరావు, బొప్పన రాంబాబు, తాళ్లూరి చందు, నందమూరి శ్రీనివాస్, తదితరులు మంత్రి నిమ్మలకు శుభాకాంక్షలు తెలిపారు.

తాడేపల్లిగూడెం అర్బన్: రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి అచ్చెన్నాయుడుని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి మంగళవారం విజయవాడలో మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ కూటమి విజయానికి కష్టపడిన ప్రతి ఒక్కరికి గుర్తింపు ఉంటుందన్నారు. గొర్రెల శ్రీధర్, కిలపర్తి వెంకట్రావు, పరిమి రవికుమార్, దాసరి అప్పన్న, గంధం సతీష్, వాడపల్లి సుబ్బరాజు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీ గణపతి హోమం

పాలకొల్లు అర్బన్, జూన్ 25: క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయంలో సంకటహర చతుర్థిని పురస్కరించుకుని మంగళవారం శ్రీలక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. చండీహోమ కార్యక్రమంలో 22 మంది దంపతులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న దంపతులకు స్వామివారి శేష వస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు.

ఎట్టకేలకు రోడ్డు పనులు ప్రారంభం



గణపవరం, జూన్ 25: సరిపల్లె-కొత్తపల్లి రహదారి ఛిద్రమై నాలుగేళ్లుగా ప్రజలు పడుతున్న ఇబ్బందులు ఇంక తొలగనున్నాయి. సుమారు రూ.20 లక్షలతో ఈ రహదారి నిర్మాణ పనులను సోమవారం నుంచి ప్రారంభించారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వాసుపత్రిలో స్వచ్ఛ భారత్



పిప్పర ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో స్వచ్ఛభారత్ చేపట్టిన టీడీపీ నేతలు

గణపవరం, జూన్ 25: పిప్పర ప్రభుత్వాసుపత్రి ఆవరణలో చిట్టడివిలా పేరుకుపోవడంతో దోమలు పెరిగి అపరిశుభ్రంగా తయారయ్యే ప్రమాదం ఉందని గ్రహించిన టీడీపీ నేతలు మంగళవారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఆవరణలో ఉన్న పిచ్చి మొక్కలు తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారు. చెత్తాచెదరాన్ని వాహనాలపై గ్రామ శివారులకు తరలించారు. మాజీ సర్పంచ్ కొప్పిశెట్టి ఏసుబాబు, ఎంపీటీసీ మాజీ సభ్యులు దొంగా అప్పారావు, గుండుగొలను బాబురావు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గోరంట్లను కలసిన వీసీ

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 25: రాజమండ్రి రూరల్ సీనియర్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చియ్య చౌదరిని డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయ ఉపకులపతి టి. జానకిరామ్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వర్సిటీ చేపట్టిన అభివృద్ధిని వివరించారు.

ఫిజియో థెరపీతో శారీరక దృఢత్వం

పాలకొల్లు అర్బన్/రూరల్, జూన్ 25 : శారీరక, మానసిక వైకల్యం కలిగిన పిల్లలకు ఫిజియో థెరపీ ద్వారా దృఢత్వం లభిస్తుందని, ఎంఈవో జి.వీరాస్వామి అన్నారు. స్థానిక ఆర్‌వీ రాజు మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ఉన్న భవిత కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ఫిజియో థెరపీ శిబిరాన్ని ఎంఈవో వీరాస్వామి ప్రారంభించారు. ఫిజియో థెరపీ డాక్టర్ జి. ఆమోస్ మాట్లాడుతూ ప్రతీ మంగళవారం ఈ కేంద్రంలో ఫిజియో థెరపీ తరగతులు నిర్వహిస్తామన్నారు.

లయన్స్ నగర్‌లో పారిశుధ్య పనులు

పాలకొల్లు రూరల్, జూన్ 24 : రూరల్ పంచాయతీ లయన్స్ నగర్ ఏరియాలో మంగళవారం పారిశుధ్య కార్యక్రమాన్ని చేపట్టారు. మాజీ సర్పంచ్ దొడ్డా శేషారత్నం, టీడీపీ గ్రామ అధ్యక్షుడు దొడ్డా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రోడ్డు పక్క చెత్త తొలగింపు, డ్రెయిన్లు బాగు చేయడం వంటి కార్యక్రమాలను చేపట్టారు. ఈకార్యక్రమంలో నాయకులు కోడి విజయభాస్కర్, పాముల రజనీ కుమార్, పంచాయతీ సిబ్బంది జక్కంపూడి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మంచిలిలో ఉచిత గుండె పరీక్షల శిబిరం

అత్తిలి, జూన్ 25 : ఉచిత వైద్య శిబిరాల నిర్వహణ అభినందనీయమని అత్తిలి మండల టీడీపీ అధ్యక్షుడు ఆనాల ఆదినారాయణరావు అన్నారు. కూటమి ఆధ్వర్యంలో మంచిలిలో విజయవాడ ఉషా కార్డియాక్ సెంటర్ గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన ఉచిత గుండె వైద్య శిబిరాన్ని ఆదినారాయణరావు ప్రారంభించారు. డాక్టర్ బలుమూరి వెంగళరావు బృందం శిబిరంలో అధిక సంఖ్యలో పాల్గొన్న రోగులను పరీక్షించి వైద్య సలహాలు ఇచ్చి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సర్పంచ్ చింతా రామారావు, ఉప సర్పంచ్ ఏరుబండి అయ్యప్ప పాల్గొన్నారు.

ముందు జాగ్రత్తలు తీసుకోవాలి

భీమవరం టౌన్, జూన్ 25: సీజనల్ వ్యాధుల పట్ల ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని మునిసిపల్ కమిషనర్ ఎం. శ్యామల ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం కౌన్సిల్ హాల్‌లో ప్రజారోగ్య శాఖ, సచివాలయ సెక్రటరీలలో సమీక్ష చేశారు. ఆమె మాట్లాడుతూ ట్యాంకులను క్రమం తప్పకుండా ప్రతి 15 రోజులకు ఒకసారి శుభ్రం చేయించాలన్నారు. తాగునీటి శాంపిల్స్ సంబంధిత ల్యాబ్‌లో టెస్టింగ్ జరుగుతుందో లేదో పర్యవేక్షించాలి అన్నారు. వార్డు సచివాలయ సిబ్బంది సదరు విషయాలను మానిటర్ చేయాలని ఆదేశించారు. పట్టణంలోని ప్రధాన కూడళ్ళు, రోడ్ల వెంబడి చెత్త పోగులు లేకుండా వాటిని ఎప్పటికప్పుడు తరలింపుకు శానిటేషన్ సెక్రటరీలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు తగు చర్యలు తీసుకోవా లన్నారు. పైపులైన్‌ల లీకేజీలు అరికట్టకపోతే తాగునీరు కలుషితమయ్యి డయేరియా ప్రబలుతుందని అన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ



దగ్గులూరులో విద్యార్థులకు విద్యాసామగ్రి అందిస్తున్న టీడీపీ నాయకులు

పాలకొల్లు రూరల్, జూన్ 25:దగ్గులూరు ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం పాఠ్యపుస్తకాలు, విద్యాసామగ్రి బ్యాగ్‌లు, బెల్టులు, బూట్లను మండల పరిషత్ ఫ్లోర్ లీడర్ శాగా సత్యనారాయణ అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాముల రజనీ కుమారి, అందే కోటి వీరభద్రం, సర్పంచ్ కనక భద్రం, నాయకులు కలిదిండి రామచంద్రరాజు, ఉపాధ్యాయులు బి నరసింహారావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

• వెలివెల గ్రామంలోని ఎంపీపీ పాఠశాలలో సర్పంచ్ కందుల వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ గెడ్డం కుటుంబరావు తదితరులు విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, విద్యాసామగ్రి అందజేశారు. కార్యక్రమంలో కోడి విజయ భాస్కరరావు, టీడీపీ నేతలు దొమ్మేటి ఏసుదాసు, కోటి రాంబాబు, కె.నాగేశ్వర రావు, వీఎస్ ఆదినారాయణ, నాగరాజు, లక్ష్మయ్య ధనరాజు, బుజ్జి శ్రీను, హెచ్‌ఎం బళ్ళ శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

నరసాపురం రూరల్: గొంది గ్రామంలో మంగళవారం ప్రభుత్వ స్కూల్ విద్యార్థులకు బ్యాగ్‌లు, పుస్తకాలను సర్పంచ్ మద్దాల అంజిబాబు, యర్రంశెట్టి నాగేశ్వరరావు పంపిణీ చేశారు.

పోడూరు: రావిపాడు పాఠశాలలో టీడీపీ ఉపాధ్యక్షుడు పెన్మెత్స రామభద్ర రాజు విద్యార్థులకు విద్యాకిట్లను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పెన్మెత్స విజయలక్ష్మి, మాజీ సర్పంచులు వాసా కోటగౌతమేశ్వరుడు, రావి స్వర్ణసింగ్, నాయకులు సిద్దాని మోక్షగణపతి, తోటకూర రమేష్‌రాజు పాల్గొన్నారు.

భీమవరం అర్బన్: చినరంగనిపాలెం మున్సిపల్ హైస్కూల్‌లో విద్యాకిట్లను మంగళవారం టీడీపీ నాయకులు చెల్లబోయిన సుబ్బారావు, బొక్కా సూరిబాబు, గోవింద్ చేతుల మీదుగా అందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంట్రావు తదితరులు పాల్గొన్నారు.

మొగల్తూరు: పేరుపాలెం సౌత్ పంచాయతీ దిబ్బల పల్లవపాలెం ప్రాథమిక పాఠశాలలో మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు అంద్రాజు రామన్న, మాజీ ఉప సర్పంచ్ కొల్లాటి నాగరాజు శైలజ మంగళవారం విద్యార్థులకు కిట్లు పంపిణీ చేశారు. అలాగే కాళీపట్నం ప్రాథమిక పాఠశాలలో సర్పంచ్ మేడిద సౌజన్య ఆధ్వర్యంలో విద్యార్థులకు కిట్లు అందించారు. మొగల్తూరు పంచాయతీ పరిధి పాలకమ్మ చెరువు ప్రాథమిక పాఠశాలలో సర్పంచ్ పడవల మేరీ కిట్లు అందించారు.

వీధి పశువులకు టీకాలు

మొగల్తూరు, జూన్ 25: రామకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పశుసంవర్ధకశాఖ సహకారంతో మంగళవారం మొగల్తూరు, ముత్యాలపల్లి గ్రామాల్లోని వీధి పశువులకు టీకాలు వేయించారు. మంగళవారం రోడ్లపై తిరిగే 102 పశువులకు టీకాలు వేయించడం జరిగిందని ట్రస్ట్ వ్యవస్థాపకుడు తణుకుల రామకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ సిబ్బంది మస్తాన్ వల్లి, బి.ప్రవళిక, ఎస్కె షరీఫ్, ట్రస్ట్ సభ్యులు నవీన్, చిట్టి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య సేవలు

తణుకు, జూన్ 25: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, జనరిక్ మందులు షాపు సంయుక్త ఆధ్వర్యంలో వృద్ధులకు ఉచిత వైద్య సేవలందించారు. మంగళవారం సంఘ కార్యాలయంలో ప్రముఖ వైద్యులు బి.రమేష్‌చంద్రబాబు 28 మందికి బీపీ, షుగర్ పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు. సంఘ అధ్యక్ష, కార్యదర్శులు ఈదర సత్యనారాయణ, కోసూరి గాంధీ, జిల్లా అధ్యక్షుడు అడ్డాల సత్యనారాయణ, ఇవటూరి లక్ష్మణరావు, చేబ్రోలు సాధు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో పోస్టులు భర్తీ చేయాలి

తణుకు, జూన్ 25: వేల్పూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని సీపీఎం గ్రామ కమిటీ ప్రభుత్వాన్ని కోరింది. ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ టెక్నీషియన్, ఎఫ్ఎన్ఓ, ఎంఎన్ఓ, వాచ్‌మన్ పోస్టులు భర్తీ చేయాలని మంగళవారం సీపీఎం గ్రామ కార్యదర్శి బళ్ళ చిన వీరభద్రరావు ప్రకటనలో కోరారు.

ఉక్కపోత... వేడిగాలులు



ఆచంటలో నిర్మానుష్యంగా ఉన్న ప్రధాన రహదారి

ఆచంట, జూన్ 25: వాతావరణం మార్పులు దృష్ట్యా మరలా రెండు రోజులుగా ఎండలు దంచికొడుతున్నాయి. వేసవి కాలం తరహాలో ఉదయం నుంచే సూర్యుడు తన ప్రతాపాన్ని ప్రదర్శిస్తున్నాడు. ఎండలకు తోడు ఒక్కటే ఉక్కబోత.. వేడి గాలులు కూడా ఎక్కువగా ఉండటంతో ప్రజలు అలసిపోతున్నారు. దీంతో మధ్యాహ్నం వేళల్లో ఎండ దాటికి ప్రజలు ఇంటికే పరిమితం కావడంతో రహదారులు సైతం నిర్మానుష్యంగా ఉంటున్నాయి.

మరుగుదొడ్డిని పునర్నిర్మించాలని వినతి

ఆచంట, జూన్ 25: కొడమంచిలి పెదపేటలో పదిహేను సంవత్సరాలు క్రితం నిర్మించిన మరుగుదొడ్డిని ఇటీవల స్థానిక సర్పంచ్ సహాయంతో కూల్చి వేసిన కారణంగా మరలా మరుగుదొడ్డిని పునర్‌నిర్మించాలని కోరుతూ మంగళవారం పంచాయతీ కార్యదర్శి నానికి అలాగే కూటమి సభ్యులకు స్థానికులు వినతిపత్రం అందజేశారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



వాటర్‌ట్యాంక్ పైకి ఎక్కి నీటిని పరిశీలిస్తున్న ఎంపీడీవో

పెనుగొండ, జూన్ 25: ప్రస్తుత వాతావరణ పరిస్థితులు దృష్ట్యా డయేరియా, అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో సుండం శ్రీనివాస్ దొర అన్నారు. పెనుగొండ మండలంలో పలు గ్రామాలను ఆయన సందర్శించి పలు సూచనలు చేశారు. శానిటేషన్, డ్రింకింగ్ వాటర్ పలు అంశాలను పరిశీలించారు. వడలి గ్రామంలో వాటర్‌ట్యాంక్ పైభాగం నుంచి వాటర్ క్లోరినేషన్ లోపలి భాగంలో శుభ్రపరిచిన అంశాలను స్వయంగా పరిశీలించారు. చినమల్లంలో శానిటేషన్ పనులు పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ ఈవో వెంకటరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈఈ శ్రీనివాసు పాల్గొన్నారు.

జీవి మనుగడకు మొక్కలే ఆధారం



మొక్కలు నాటుతున్న సర్పంచ్ గనిరాజు

పెనుగొండ, జూన్ 25: ప్రాణకోటికి జీవనాధారం మొక్కలేనని సర్పంచ్ చింతపల్లి గనిరాజు అన్నారు. మంగళవారం సిద్ధాంతం వాకర్స్ అసోసియేషన్, రిటైర్డ్ ఉద్యోగులు, పంచాయతీ అధికారులు సంయుక్తంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. నాగమ్మ గుడి వద్ద నుంచి అయ్యప్ప స్వామి గుడి వరకు సుమారుగా 200 మొక్కలు నాటారు.

వాహనాల తనిఖీ

ఆకివీడు, జూన్ 25: లైసెన్సులు లేని పిల్లలకు తల్లిదండ్రులు మోటారు వాహనాలు నడపకుండా చూడాలని ఎస్ఐ బత్తిన నాగబాబు అన్నారు. మంగళవారం స్థానిక గాంధీజీ సెంటర్‌లో మోటారు వాహనాలకు సంబంధించి పత్రాలు, లైసెన్సులు, త్రి బుల్ డ్రైవింగ్ తదితర వాహనాలు నిలుపుదల చేసి కేసులు నమోదు చేశారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ సూర్యనారాయణ, హోమ్‌గార్డు రాజు ఉన్నారు.

గొల్లోరు బోదె ప్రక్షాళన



పాలకోడేరు, జూన్ 25: గొల్లలకోడేరు గ్రామంలోని గొల్లోరుబోదె ప్రక్షాళనను గ్రామ టీడీపీ అధ్యక్షుడు కమ్మిలి రాంబాబు ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టారు. గ్రామంలోని రజకులపేట నుంచి గ్రామ ఊరుశివారు వరకు ఉన్న సుమారు 2కిలోమీటర్ల మే ఉన్న గొల్లోరుబోదు పూర్తిగా పూడుకుపోయింది. దీంతో అయా ప్రాంత వాసులకు, రైతులకు సరైన సాగునీరందక తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు నియోజకవర్గంలో ఉన్న పంట కాల్వలను, పంటబోదెలను, మురుగుబోదెలను పూర్తిగా ప్రక్షాళన చేయాలని ఆయన నడుంబిగించారు. ఆయన ఆదేశాలతో బోదెల ప్రక్షాళన పనులు చేపట్టారు. టీడీపీ నాయకుడు కనుమూరి నరసింహరాజు, బీసీ టీడీపీ నాయకుడు కామన రాంబాబు, మాజీ సర్పంచ్ గాదిరాజు సూర్యనారాయణరాజు, సంబలదీవి వెంకటేశ్వరరావు, జుత్తిగ శ్రీను, సలా మల్లేశ్వరరావు, వంగపల్లి ఏసురత్నం, తంగెళ్ళ శ్రీను పనులను పర్యవేక్షించారు.

బాపిరాజు జన్మదిన వేడుక



కేక్‌ను కట్ చేస్తున్న అంకెం సీతారామ్

భీమవరం అర్బన్, జూన్ 25: టీటీడీ మాజీ చైర్మన్ కనుమూరి బాపిరాజు పుట్టిన రోజు వేడుకను భీమవరం నియోజకవర్గ కాంగ్రెసు పార్టీ ఇన్‌చార్జి అంకెం సీతారాం ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్‌ను కట్ చేసి పేదలు, వృద్ధులకు పండ్లు స్వీట్లు పంపిణీ చేశారు. భీమవరంలో పాస్‌పోర్టు కార్యాలయం తీసుకువచ్చిన ఘనత బాపిరాజుదే అని, జిల్లాలో రైల్వే డబుల్ లైన్లు రావడానికి ఎంతో కృషి చేశారన్నారు.

జగనన్న కాలనీలో రాళ్ళు తొలగింపు

భీమవరం రూరల్, జూన్ 25 : కొత్త పూసలమర్రు గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా జగనన్న కాలనీ స్థలాలను ఏర్పాటు చేశారంటూ మంగళవారం స్థానికులు కాలనీలోని రాళ్ళను తీసివేశారు. అర్హులకు కాకుండా అనర్హులకు కూడా స్థలాలు కేటాయించారని వారు ఆరోపించారు. తహసీల్దార్‌ను సంప్రదించగా రెవెన్యూ అధికారికి తెలియపరచడం జరిగిందని వివరాలు సేకరిస్తామన్నారు.